
# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక



JULY - 2003

## సంక్షిప్త వార్తలు

2003 ఏప్రియల్ 11వ తేది నుండి 29వ తేది వరకు కుంటముక్కల గ్రామ వాస్తవ్యులు సోదరులు కె.జె.సుదర్శనం గారు బొంబాయి మహానగరంలో సువార్త పర్యటన గావించిరి. ఆయన వృద్ధులైనను మంటుడెండలను లెక్కచేయక సువార్త నిమిత్తము బహుగా శ్రమించిరి. బొంబాయిలో గోరెగాం, అంధేరి, ఓర్లామ్, టక్కర్ బాబాకోలనీ, మహోల్, వసాయ్, మాల్వానీ, గణేష్ నగర్, కాందివీలి మొదలగు ప్రాంతములు దర్శించి సంఘములను హెచ్చరించి సహోదరులను విశ్వాసమునందు బలపరచిరి. ఆయన పర్యటన సందర్భముగా 5గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. బొంబాయి మహానగరంలో యున్న క్రీస్తు సంఘముల కొరకు, సోదరులు సుదర్శనం గారి కొరకు, అస్వస్థతగా యున్న ఆయన సతీమణి కొరకు ప్రార్థించమనవి.

జూన్ నెల 7వ తేది శనివారం నాడు అంబాజీపేట నాగాబత్తులు వారి పాలెంలో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయము, గృహ సముదాయమును జాషువా గూటం గారు రిబ్బను కత్తిరించి ప్రతిష్ఠ చేసిరి. ఆనాడు గాడ్పు బహుతీవ్రముగా యున్నను పలుప్రాంతముల సువార్తికులు అక్కడకు చేరుకో గల్గిరి. ఆ మరుచటి రోజునుండే క్రొత్త వసతిలో ఆరాధన ప్రారంభించబడెను. అక్కడ బాప్తిస్మము పొందిన వారు క్రమముగా రొట్టె విరుచుచున్నట్లు సోదరులు ఆర్. సామ్యేలుగారు తెలియజేయుచున్నారు. అక్కడ నిర్మాణము, ప్రతిష్ఠ కార్యక్రమములు రాపాక రాజారావు, రాపాక విక్టర్ డానియేలు గారి ఆధ్వర్యమున జయకరముగా జరిగెను. ఆ సందర్భముగా జాషువా గూటం గారు మంచి వర్తమానము నందించిరి. తదుపరి హాజరైన వారందరికీ మంచి విందు ఏర్పాటు చేయబడెను.

జూన్ 5, 6, 7 తేదిలలో రాజమండ్రి దానవాయి పేట క్రీస్తు సంఘము సువార్త కూటములు బైబిలు తరగతులు నిర్వహించిరి. పగటివేళ బైబిలు తరగతులు సంఘ ఆవరణములోను రాత్రివేళ బహిరంగ సువార్త కూటములు సెయింట్‌పాల్ ఈస్టు లూథరన్ చర్చి గ్రౌండులోను

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**

Pleading for Restoration of First Century Christianity

సంపుటిక 23 జూలై 2003 సంచిక 12


## ప్రార్థన
*(Prayer)*

ప్రార్థన ప్రతి క్రైస్తవ జీవితములోను ప్రధానమైనది. అది ఆరాధనలో ఒక భాగమై యున్నది. మొదటి క్రైస్తవులు అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుటయందును, ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి యని వాక్యము చెప్పుచున్నది (అపొ.కా. 2:42).

"మనుష్యులు విసుగక నిత్యము ప్రార్థన చేయుచుండవలెనని" క్రీస్తు బోధించెను (లూకా 18:1). "యెడతెగక ప్రార్థన చేయుడి; ప్రతి విషయము నందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి" యని అపొస్తలుడైన పౌలు బోధించెను (1 థెస్స 5:17). దేవుడు తన లేఖనముల ద్వారా మనతో మాటలాడును గాని ప్రార్థన ద్వారా మనము దేవునితో మాట్లాడుదుము.

గనుక ప్రార్థనలేని ఆరాధన, ఆరాధన కానేరదు అని గ్రహించవలెను.

దేవుని సన్నిధానమునకు మనము చేరుటకు ప్రార్థన ఒక గొప్ప అవకాశము నిచ్చును. అందువలన "దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను" (హెబ్రీ 11:6). ద్రాక్షావల్లికిని దాని తీగెలకును ఎట్టి సంబంధ మున్నదో ప్రార్థించు మానవునికిని దేవునికిని అట్టి సంబంధమున్నది. "ద్రాక్షావల్లిని నేను, తీగెలు మీరు. ఎవడు నాయందు నిలిచియుండునో, నేను ఎవనియుందు నిలిచియుందునో వాడు బహుగా ఫలించును; నాకు వేరుగా ఉండి మీరేమియును చేయలేరు" అని యేసుక్రీస్తు బోధించెను (యోహా 15:5). మనము ప్రార్థించునప్పుడు దేవుడు మనమొరల నాలకించునని విశ్వసించవలెను. "యెహోవా దృష్టి నీతిమంతులమీదనున్నది. ఆయన చెవులు వారి మొరలకు ఒగ్గి యున్నవి" యని కీర్తనలు 34:15లో వ్రాయబడి యున్నది. "ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను, ఆయన చెవులు వారి ప్రార్థనల వైపునను ఉన్నవి గాని ప్రభువు ముఖము కీడుచేయువారికి విరోధముగా ఉన్నది" యని 1 పేతురు 2:12 చెప్పుచున్నది.

దేవుడు మన ప్రార్థనల నాలకించుటయేగాక వాటికి ప్రతిఫలమిచ్చును. "అడుగుడి మీ కియ్యబడును, వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తీయబడును. అడుగు ప్రతివాడును పొందును. వెదకువానికి దొరకును, తట్టువానికి తీయబడును. మీలో ఏ మనుష్యుడైనను తన కుమారుడు తన్ను రొట్టెను అడిగినయెడల వానికి రాతినిచ్చునా? చేపను అడిగినయెడల పాము నిచ్చునా? మీరు చెడ్డవారైయుండియు మీ పిల్లలకు మంచి యీవుల నియ్యనెరిగి యుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటె ఎంతో నిశ్చయముగా మంచి యీవులనిచ్చును" అని యేసు క్రీస్తు బోధించెను (మత్తయి 7:7-11).

మన ప్రార్థనలను దేవుడు అంగీకరించవలెనంటే మనము

నిష్కపటులమై యుండవలెను. యేసు ఇట్లు చెప్పెను. "మీరు ప్రార్థన చేయునప్పుడు వేషధారులవలె ఉండవద్దు; మనుష్యులకు కనబడవలెనని సమాజ మందిరములలోను, వీధుల మూలలోను నిలిచి ప్రార్థన చేయుట వారికిష్టము; వారు తమ ఫలము పొంది యున్నారని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను" (మత్తయి 6:5). యెషయా 29:13లో "ప్రభువు ఈలాగు సెలవిచ్చుచున్నాడు - ఈ ప్రజలు నోటిమాటతో నాయొద్దకు వచ్చుచున్నారు. పెదవులతో నన్ను ఘనపరుచుచున్నారు గాని తమ హృదయమును నాకు దూరము చేసికొని యున్నారు. వారు నా యెడల చూపు భయభక్తులు మానవుల విధులను బట్టివారు నేర్చుకొనినవి".

## వినయము కలిగి యుండాలి

ప్రార్థన చేయునప్పుడు మనము వినయము కలిగి నమ్రతతో యుండవలెను. మన స్వనీతిని మనము చాటించుకొనుచు దేవుని యొద్దకు చేరుట దుర్లభము. ఈ సందర్భములో యేసు ఒక ఉపమానము చెప్పెను. "ప్రార్థన చేయుటకై యిద్దరు మనుష్యులు దేవాలయమునకు వెళ్లిరి. వారిలో ఒకడు పరిసయ్యుడు, ఒకడు సుంకరి. పరిసయ్యుడు నిలువబడి-దేవా! నేను చోరులును, అన్యాయస్థులను, వ్యభిచారులు నైన యితర మనుష్యులవలెనైనను, ఈ సుంకరివలెనైనను ఉండనందుకు నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. వారమునకు రెండుమారులు ఉపవాసము చేయుచు, నా సంపాదన అంతటిలో పదియవ వంతు చెల్లించుచున్నానని తనలో తాను ప్రార్థించుచుండెను. అయితే సుంకరి దూరముగా నిలుచుండి, ఆకాశము వైపు కన్నులెత్తుట కైనను ధైర్యము చాలక, రొమ్ము కొట్టుకొనుచు-దేవా! పాపినైన నన్ను కరుణించుమని పలికెను. అతనికంటె ఇతడు నీతిమంతుడుగా తీర్చబడి తన యింటికి వెళ్లెనని" యేసు చెప్పెను (లూకా 18:10-14). దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును అని లేఖనము చెప్పుచున్నది (యాకోబు 4:6). "నా పేరు పెట్టబడిన నా జనులు తమ్మును తాము తగ్గించుకొని ప్రార్థన చేసి నన్ను వెదకి తమ చెడు మార్గములను విడచిన

యెడల, ఆకాశము నుండి నేను వారి ప్రార్థనను విని, వారి పాపములను క్షమించి వారి దేశమును స్వస్థపరచుదును" అని యెహోవా సెలవిచ్చుచున్నాడు (2 దినవృ 7:14). మనము ప్రార్థన చేయునప్పుడు ఆసక్తితో ప్రార్థన చేయవలెను (యాకో 5:17); తరచు ప్రార్థన చేయవలెను (లూకా 11:5-8). ప్రార్థన యందు నిలకడగా ఉండి కృతజ్ఞత గలవారై దాని యందు మెలుకువగా యుండవలెను (కొలస్స 4:2). మరియు మన మాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన దృష్టికి ఇష్టమైనవి చేయవలెను. అప్పుడు మనమేమి అడిగినను అది ఆయన వలన మనకు దొరుకును (1 యోహా 3:22). "భక్తిహీనులకు యెహోవా దూరస్థుడు, నీతిమంతుల ప్రార్థన ఆయన అంగీకరించును" (సామె 15:29).

## దేవుని స్తుతించాలి

ప్రార్థన చేయునపుడు ముందుగా మనము దేవుని మహిమ పరచవలెను. ఆయనను స్తుతించవలెను. "సైన్యముల కధిపతియగు యెహోవా పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు; సర్వలోకము ఆయన మహిమతో నిండియున్నది" యని ఆయనను దూతలు మహిమ పర్చుచున్నట్లు యెషయా వ్రాసెను (యెషయా 6:3). దేవుని మహిమను కొనియాడుటెట్లో తెలిసికొనుటకు 1 దినవృ 29:11, దా.కీర్త 104:1, ప్రకటన 4:11, 19:1లను చదువండి. యేసుక్రీస్తు తన శిష్యులకు చూపిన మాదిరి ప్రార్థనలో - పరలోకమందున్న మాతండ్రీ, నీ నామము పరిశుద్ధ పరచబడునుగాక యని నేర్పించెను.

శ్రేష్ఠమైన ప్రతి యీవియు, సంపూర్ణమైన ప్రతి వరమును, పరసంబధమైనదై జ్యోతిర్మయుడగు తండ్రియొద్ద నుండి వచ్చును (యాకోబు 1:17). గనుక మన ప్రార్థనలో దేవునికి మనము కృతజ్ఞత చెల్లించవలెను. (లూకా 15:21). "మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల ఆయన నమ్మదగినవాడును, నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహా 1:9).

ప్రార్థన ద్వారా దేవునికి మనభౌతిక, ఆత్మీయావసరములను గూర్చి విజ్ఞాపనము చేయవలెను. "దేనిని గూర్చియు చింతపడకుడి. గాని ప్రతి విషయములోను ప్రార్థన, విజ్ఞాపనముల చేత కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి" యని పౌలు ఫిలిప్పీయులకు వ్రాసెను (ఫిలి 4:6).

దేశ నాయకులకొరకు, అధికారుల కొరకు మనము ప్రార్థించ వలెను (1 తిమో 2:2). క్రైస్తవులందరికొరకు, (ఎఫెసీ 6:18), సువార్తను బోధించువారికొరకు, రోగుల కొరకు (యాకో 5:14-16), రక్షింపబడలేని వారికొరకు (రోమా 10:1), తుదకు మన శత్రువుల కొరకు మనము ప్రార్థన చేయవలెను (మత్తయి 5:43-46).

## దేవుని చిత్తానుసారముగ యుండాలి

మన ప్రార్థనలు దేవుని చిత్తానుసారముగ యుండవలెను. భక్తుడైన యోహాను ఇట్లు చెప్పుచున్నాడు: "ఆయనను బట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా ఆయన చిత్తానుసారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి నాలకించుననునదియే" (1యోహా 5:14). ఆయన చిత్తప్రకారము కానివాటిని మనమేది అడిగినను ఆయన ఎట్లు దయ చేయును? భక్తుడైన యాకోబు ఇట్లనుచున్నాడు: "మీలో యుద్ధములును పోరాటములును దేనినుండి కలుగుచున్నవి? మీ అవయవములలో పోరాడు మీభోగేచ్ఛల నుండియేగదా? మీ రాశించుచున్నారు గాని మీకు దొరుకుట లేదు; నరహత్య చేయుదురు, మత్సర పడుదురు గాని సంపాదించుకొనలేరు; పోట్లాడుదురు, యుద్దము చేయుదురు గాని దేవుని అడుగనందున మీకేమియు దొరకదు. మీరడిగినను మీ భోగముల నిమిత్తము వినియోగించుటకై దురుద్దేశ ముతో అడుగుదురు గనుక మీ కేమియు దొరకదు" (యాకోబు 4:1-3).

దేవునికి ప్రార్థన చేయు ప్రతివాడును క్రైస్తవుడయి యుండవలెను. ఏలయనగా ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను, ఆయన చెవులు వారి ప్రార్థనల వైపునను ఉన్నవి (2 పేతు 3:12). ప్రార్థించు ప్రతివాడు

ఆత్మీయ సంగతులపై ఆసక్తిగలవాడై యుండవలెను, సందేహింపక విశ్వాసముతో అడుగువాడై యుండవలెను (యాకో 1:5-6). దేవుని చిత్తమును నెరవేర్చుటకు ఆసక్తి కలవాడై యుండవలెను. (1 యోహా 5:15). ఆరాధనలో ప్రార్థించునపుడు సంఘము తరపున ప్రార్థించువాడై యుండవలెను (1 కొరింథి 14:16).

నీ ప్రార్థన ద్వారా దేవుని మహిమపరచి సేవించుము. అది క్రైస్తవుని కీయబడిన బలమైన ఆత్మీయ ఆయుధము. దానిని తరచు నీదైనిక జీవితమునందుపయోగించుము. ప్రార్థన నీ జీవితములో గొప్ప మార్పును తేగలదు. దేవుడు తన వాక్యము ద్వారా మనతో మాట్లాడును. మనమా యనతో మాట్లాడుటకు ఒకేఒక్క మార్గము కలదు. అదియే ప్రార్థన.

❖❖❖

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న
'సత్యవాణి' టి.వి. కార్యక్రమమును ప్రతి
శనివారం ఉదయం 6:30 నుండి 7:00
వరకు తేజ చానల్‌లో చూడండి, మీ తోటి
సహోదరులకు తెలియజేయండి.

ఉపమానమాలిక:

# మంచి నేలను పడిన విత్తనము

## లూకా 8:4-14

యేసు ప్రభువు బోధించు చుండగా వినుచున్న జనసమూహములో కనీసం నాలుగు రకములైన ప్రజలుండే వారు. ఆయనను శోధించడానికి వచ్చిన శాస్త్రులు, పరిసయ్యులు ఒక గుంపు; ఆయన అద్భుతములు మహత్కార్యములు చేస్తుంటే చూచి ఆనందించడానికి వచ్చిన వారొక గుంపు; ఆయన అద్భుత కార్యము చేసి భోజనం పెడితే తినడానికి వచ్చిన వారొక గుంపు; మరియు నిజముగా ఆత్మీయ సత్యములను యేసు నోటినుండి విని గ్రహించి వాటి ప్రకారము జీవించుటకు ఆసక్తి గలిగిన వారొక గుంపు.

ఈ నాలుగు రకములైన ప్రజలు ఏ రకమైన హృదయము కలిగి వినుచున్నారో జాగ్రత్తగా తమకు తామే చూచుకొనునట్లు యేసు వారిని త్రోవ ప్రక్కన విత్తనములు పడిన హృదయము గలవారిగను, రాతి నేలను పడిన విత్తనములుగను, ముండ్ల పొదలలో పడిన విత్తనములుగను, మంచి నేలను పడిన విత్తనములుగను పోల్చుచు విత్తువాని ఉపమానమును వారికి బోధించారు.

మంచి నేలను పడిన విత్తనములను గూర్చి చెబుతు "ఒకటి నూరంతలుగాను, ఒకటి అరువదంతలుగాను, ఒకటి ముప్పదంతలుగాను ఫలించెను" అని ఆయన చెప్పారు (మత్త 13:8). "మంచి నేల నుండు (విత్తనమును పోలిన) వారెవరనగా యోగ్యమైన మంచి మనస్సుతో వాక్యము విని దానిని అవలంబించి ఓపికతో ఫలించువారు" (లూకా 8:15), "మంచి నేలను విత్తబడినవాడు వాక్యము విని గ్రహించువాడు; అట్టివారు సఫలులై యొకడు నూరంతలుగాను ఒకడు అరువదంతలు గాను ఒకడు ముప్పదంతలుగాను ఫలించునని" యేసు ప్రభువు దాని భావము చెప్పారు.

విత్తనము దేవుని వాక్యమని మనం ముందే నేర్చుకొని యున్నాము

(లూకా 8:11). క్రీస్తు వాక్యము విత్తబడుచుండగా కొన్ని విత్తనములు మంచి హృదయాల్లో తప్పక విత్తబడతాయి. అట్టి హృదయాలు సత్య సువార్త కొరకు సిద్ధపరచబడి యున్నట్టివి.

మంచి నేలను విత్తబడిన వారెవరు? "మంచి నేలను విత్తబడిన వారెవరనగా, వాక్యమును విని దానిని గ్రహించు కొనువారు". మీరేలాగు వినుచున్నారో జాగ్రత్తగా చూచుకొనుడి యని ఉపదేశిస్తూ యేసు ఈ ఉపమానాన్ని చెప్పారు. మంచి నేలను విత్తబడినవారు జాగ్రత్తగా వినువారై యున్నారు. జన సమూహములో యున్న వారందరు వింటూనే యున్నారు గాని, అందరు ఫలించలేదు. వారు ఎట్లు విన్నారో, ఏలాగు విన్నారో, దానిపై వారు ఫలించారో లేదో ఆధారపడియున్నది. మంచి నేల వంటి హృదయము గలవారు జాగ్రత్తగా వినువారై యున్నారు.

వారు జాగ్రత్తగా వినడమే కాకుండా దానిని గ్రహించు కొన్నారు. మొద్దు బారి పోయిన హృదయము గలవాడు విన్నాడు గాని గ్రహించుకో లేదు; అందుకై ప్రయత్నించనే లేదు. అతనికి ఆ సమయం దొరకకముందే అపవాది దానిని ఎత్తుకుపోయాడు. రాతి నేలను పోలిన హృదయము గలవాడు తాను అంగీకరించిన వాక్యము యొక్క సరియైన విలువ తెలిసికో లేకపోయాడు. మరింకొకడైతే తాను విని అంగీకరించిన వాక్యము అణగద్రొక్కబడేలాగ చూచుకొన్నాడు. గాని మంచి హృదయము గలవాడైతే జాగ్రత్తగ విని, గ్రహించుకొన్నాడు.

మంచి నేలను పోలిన హృదయము గలవాడు యోగ్యమైన మంచి మనస్సు గలవాడు. అతడు దురభిమాన ద్వేషమేమీ లేకుండా వింటాడు, సత్యాన్ని అంగీకరిస్తాడు. మంచి మనస్సు గలవాడు సత్యము అందించబడు చుండగా వినడానికి నిరాకరించడు. యోగ్యమైన మంచి మనస్సుతో దానిని అంగీకరిస్తాడు.

యోగ్యమైన మంచి మనస్సు గలవాడు సత్యవాక్యాన్ని అంగీకరించా డంటే దానికి లోబడ్డాడని యర్థము. అపొ.కా. 10వ అధ్యాయములో కొర్నేలీ అనే భక్తిపరుని గూర్చి మనం చదువగలము. అతడు భయభక్తులు

గలవాడై యుండి ప్రజలకు బహుధర్మము చేయుచు ఎల్లప్పుడు దేవునికి ప్రార్థన చేయువాడు (అపొ.కా. 10:1, 2). పేతురు వచ్చి అతనికి సువార్త వాక్యము బోధించగా అతడు, అతని యింటివారు బాప్తిస్మము పొందారు. వీరు యోగ్యమైన మంచిమనస్సు గలవారు; మంచి నేలను పోలిన హృదయం గలవారు. బెరయలోని ప్రజలు కూడ అట్లే. పౌలును సీలయు బెరయకువచ్చి వారికి వాక్యము బోధించుచుండగా వారు "ఆసక్తితో వాక్యము అంగీకరించి పౌలును సీలయును చెప్పిన సంగతులు అలాగున్నవో లేవోయని ప్రతి దినము లేఖనములు పరిశోధించుచు వచ్చిరి. అందుచేత వారిలో అనేకులు............... స్త్రీలలోను పురుషులలోను చాల మందియు విశ్వసించిరి" (అపొ.కా. 17:11, 12).

మంచి నేలను పోలిన హృదయము గలవాడు వాక్యమును విని, గ్రహించుటయే గాక దాని నవలంబించినవాడై యున్నాడు. వాక్యమును విన్న తరువాత అతడు తటస్థ వైఖరి నవలంబించలేదు; అపవాదిని ఎత్తుకుపోనియ్యలేదు; జీవన సంబంధమైన విచారములచేత దానిని అణచివేయలేదు గాని విని, గ్రహించుకొనిన వాక్య ప్రకారము నడువ సాగాడు. ఇది ఒకనికి ఉండవలసిన సరియైన మనస్తత్వము. వినిన దానిపై గాక, మానవుడు అభ్యాసము చేయు దానిపై అతని శీలము ఆధారపడి యుంటాది. అందుకే "మీరు వినువారు మాత్రమే యుండి మిమ్మునుమీరు మోసపుచ్చుకొనుకుడి. వాక్యప్రకారము ప్రవర్తించు వారునై యుండుడి" యని యాకోబు హెచ్చరించుచున్నాడు (యాకో 1:22).

యోగ్యమైన మంచి మనస్సు గలవారు వినిన వాక్యమును గట్టిగా పట్టుకొందురు. దానిని జ్ఞాపక ముంచు కొనుచు యుంటారు. దివారాత్రులు దేవుని వాక్యమును ధ్యానిస్తారు (కీర్త 1:1-3). వారు ఓపికతో ఫలములు ఫలిస్తారు. ఈ సహనము ఒకసద్గుణమైయున్నది. క్రీస్తు వాక్యమునకు లోబడిన వాడు సహనము కలిగి యుండాలి. అంతము వరకు సహించిన వాడే రక్షింపబడునని యేసు ప్రభువు చెప్పారు (మత్త 10:22). మంచి మనస్సుతో వాక్యము నంగీకరించిన వారు శోధనల

జయిస్తారు, ప్రభువు కొరకు ఫలములు ఫలిస్తారు. వారు యేసువైపు చూచుచు తమ యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుతారు (హెబ్రీ 12:12). మంచి నేలను పడిన విత్తనమును పోలినవారు క్రీస్తు కొరకు వందమందిని అరవై మందిని, ముప్పది మందిని, నిజానికి వేలకొలది మందిని సంపాదిస్తారు, మంచి ఫలములు ఫలిస్తారు.

క్రీస్తు వాక్యమును విని విధేయత చూపకుండా యుంటే అది హృదయాన్ని కఠిన పరచుకొనడమే అవుతాది. సహృదయత కలిగి వినువాడు సత్యాన్ని విని దానికి విధేయత చూపుతాడు; నూరంతలుగను, అరువదంతలుగను, ముప్పదంతలుగను ఫలిస్తాడు.

నీవు క్రీస్తు వాక్యమును ఏలాగు వినుచున్నావు? వినిన వాక్యాన్ని యేమి చేయుచున్నావు? యేసు ప్రభువు నందు విశ్వాస ముంచుము, నీ పాపముల విషయమై మారు మనస్సు పొంది పాప క్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందుము. యోగ్యమైన మంచి మనస్సుతో క్రీస్తు కొరకు ఫలములు ఫలించుము.

- జాషువా గూటం

❖❖❖

'సత్యవాణి' రేడియో కార్యక్రమాలను ప్రతి
ఆది, సోమ, బుధ గురువారాలలో మధ్యాహ్నం 2:00
గంటలకు రేడియో శ్రీలంక ద్వారా వినండి
మీ బంధుమిత్రులకు విన్పించండి!!

# యువతకు బైబిలు సందేశం

*(A Message to Youth)*

నేటి యువకుల మధ్య విశేషంగా వినిపించుచున్న 'టైంపాస్' అనే పదం సోమరితనానికి అభివృద్ధి నిరోధానికి సంకేతంగా యున్నది. సమయము పోనివ్వక సద్వినియోగము చేసికోనవలెనని బైబిలు బోధించుచున్నది (కొలస్స 4:5). దేవుడు మనకను గ్రహించిన సమయం చాలా విలువైనది. మనం వృథా చేసిన సమయాన్ని తిరిగి పొందలేము.

"పనివాడు తన జీతమునకు పాత్రుడు" (1 తిమో 5:18). కష్టించి పనిచేయుట యందలి గౌరవమును బైబిలు లేఖకులు అనేక సార్లు ప్రస్తావించిరి. సోమరితనమును బైబిలు తీవ్ర పదజాలంతో ఖండించుచున్నది. "సోమరీ, చీమల యొద్దకు వెళ్ళుము, వాటి నడతలు కనిపెట్టి జ్ఞానము తెచ్చుకొనుము" (సామె 6:6). చీమల యొక్క క్రమ శిక్షణ, ఐక్యత, నిరంతర శ్రమ మరియు వాటి కార్యసాధన మానవాళికి జ్ఞానాన్ని నేర్పుచున్న ఈ తరుణంలో సమయాన్ని వృథా చేయుట కొరకు మార్గాలను అన్వేషించడం విచిత్రమైన పరిస్థితి.

అభివృద్ధి చెందిన దేశాలలో 'టైంపాస్' అనే పదం వినిపించదు. అభివృద్ధి పొందుచున్న దేశాలలో ఈ రకమైన భావన దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపింపజాలదు.

అపొస్తలులు తెలియజేసిన ఈ మాటలు మనకు అనుసరణీయాలు. "మేము మీలో ఎవనికిని భారముగా ఉండకూడదని ప్రయాసముతోను, కష్టముతోను రాత్రింబగళ్ళు పనిచేయుచు జీవనము చేసితిమి" (2 థెస్స 3:8). మరియు ఎవడైనను పనిచేయ నొల్లని యెడల వాడు భోజనము చేయకూడదని ఆజ్ఞాపించిరి" (2 థెస్స 3:10).

ఏ పని చేయని వారిని అక్రమ కారులని లేఖనములు తెలియ జేయుచున్నవి. "మీలో కొందరు ఏపని చేయక పరుల జోలికి పోవుచు, అక్రమముగా నడుచుకొనుచున్నారని వినుచున్నాము. అట్టివారు నెమ్మదిగా పనిచేయుచు సొంతముగా సంపాదించుకొనిన ఆహారము

భుజింపవలెనని ప్రభువైన యేసుక్రీస్తు పేరట వారిని ఆజ్ఞాపూర్వకముగా హెచ్చరించు చున్నాము" (2 థెస్స 3:11-12).

కుటుంబాన్ని, సమాజాన్ని, దేశాన్ని ప్రపంచాన్ని అభివృద్ధి పథంలో నడిపించ గల ఉపదేశక్రమమును పరిశుద్ధగ్రంథము ప్రపంచాని కందించు చున్నది.

ప్రేమ, సహనం, శాంతం, క్షమాహృదయం, త్యాగం మరియు కష్టించి పనిచేసే సేవాగుణం కలిగిన క్రైస్తవ్యము విషయంలో ఎవరూ కలవరపడ వలసిన అవసరం లేదు. "మీరు పరలోకమందున్నా మీ తండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారికొరకు ప్రార్థన చేయుడి" అని యేసుక్రీస్తు ప్రబోధించెను (మత్త 5:44).

క్రైస్తవ్యము యువతకు ఒక ఆదర్శ మార్గాన్ని చూపించుచున్నది. మద్యపానమును తీవ్రపదజాలంతో ఖండిస్తూ దానివలన కలిగే దుష్ప్రభావ మును దానియొక్క పర్యవసానమును తెలియజేస్తూ వారిని సన్మార్గము నకు నడిపించుచున్న వెలుగు దేవుని వాక్యమే. (సామె 23:29-32). పాపమును నిశితంగా విమర్శించి (సామె 5:7-13), మానవాళికి ఎదుట ఉన్నతమైన, శ్రేష్టమైన, అనుసరణీయమైన మార్గాన్ని ఉంచింది క్రైస్తవ్యమే.

ఎందరో అనాథలను, విధవ రాండ్రను, రోగులను చేరదీసి వారికి ఆహారాన్ని, వైద్యసేవలను, ఆశ్రయాన్ని, ఆదరణను కలిగించుచున్న ప్రేమ క్రీస్తు ప్రేమయే.

ఇది యౌవనస్థులకు మాత్రమే కాదు సమస్త మానవాళికి ఆదర్శప్రాయమైన మార్గమని మరువకుము.

- ఇ.కె.వి. ప్రసాదరావు.

❖❖❖

# ప్రేరణ

దబ్బున రాలిన పండు కొబ్బరాకు
నిబ్బరించి నాతోయిలా అన్నది
చెట్టుతో కలిసున్నంత కాలం నేను
గుట్టుగా బ్రతక నేర్చాను నేస్తం!

బాల్యంలో మొవ్వాకు నై మురిసాను
విప్పారిన యవ్వనంలో కర్తవ్యం గుర్తించి
గాలిని మేస్తూ కాంతి కిరణాల నాస్వాదిస్తూ
పూత గుత్తలకు చేయూత నిస్తూ వచ్చాను!

చివరకు ఈనెలు పండిన ఎండుటాకునై
చీపురుగా నీ చేతిలో రూపాంతరమొంది
చెత్తా చెదారాన్ని ఊడుస్తూ ప్రభువు చిత్తంలో
ఆయన నాకిచ్చిన పనిని నెరవేరుస్తున్నాను!

నేస్తమా! నేల ధూళిలో నువ్వు చేరకముందే
నీ బాల్యదినములందే సృష్టికర్తను గుర్తుంచుకొని
ఆయన మహిమ కొరకే మనల్ని పుట్టించాడని
నీ దేహంతో దేవుణ్ణి మహిమ పరచాలని మరవకు!

పూవై విరిసిన నరుడు పెరిగి ఒరుగుతాడు
నిలుకడ లేనివాడు నీడలా సాగిపోతాడు
యేసు నెరిగినవాడు ఫలించే చెట్టులా ఉంటాడు
చచ్చినట్టు కనబడినా సజీవుడై చిగురిస్తాడు!
(యోబు 14:2, యోహాను 11:25, 5:24)

- యస్.జె. మేడిది, కొణితివాడ.

# మరియను గూర్చిన మాయలు

*(Myths about Mary)*

యేసు తల్లియైన మరియ ఒక గొప్ప స్త్రీ. ఆమె రాజుల వంశావళి కలిగిన ఒక భక్తిగల యూదురాలు. ఆమె ఇంక కన్యగా యుండగానే పరిశుద్ధాత్మని వలన అద్భుతరీతిగా గర్భమును ధరించి ఈలోక రక్షకునికి జనన మిచ్చెను (మత్తయి 1:18-25). ఒక బాలునిగా యేసు తన తల్లికి లోబడెను. ఆయన పెరిగి పెద్దవాడైనను తగిన రీతిగా ఆమెను ప్రేమించి గౌరవించెను (లూకా 2:51; యోహాను 19:26, 27).

మరియను గూర్చి బైబిలు చెప్పిన దంతయు సత్యము. ఆమె ధన్యురాలు, ప్రాముఖ్యమైన ఒక వ్యక్తి (లూకా 1:28-35). అయితే సహృదయులైన కొందరు సంవత్సరములు తరబడి మరియను గూర్చిన కల్పిత కథలను నమ్ముచువచ్చారు. మరియను గూర్చి ఆధునికముగా చెప్పబడుచున్న కొన్ని సంగతులు వట్టిమాయలు, హాస్యాజనకములు, అవి నిజానికి దేవదూషణకరమైనవి. వాటిలో ఈదిగువ కొన్నిటిని పరిశీలింతము:

**1. మరియయొక్క శాశ్వత కన్యాత్వము** (The Perpetual Virginity of Mary): మరియ ఎల్లప్పుడు కన్యగానే యుండెనని కొందరు విశ్వసింతురు. క్రీస్తు జన్మించిన తరువాత ఆమె జీవించిన సంవత్సరములన్నియు ఆమె కన్యగానే యుండెనని వారు భావింతురు. అయితే మరియ యోసేపుయొక్క భార్య ఆయెనని (మత్తయి 1:16, 19-20, 24-25; లూకా 2:41), యేసుకు సహోదరులు, సహోదరీలు ఉన్నట్లు బైబిలు విశదముగా బోధించుచున్నది (మత్తయి 13:55; మార్కు 16:3).

మరియ శాశ్వతముగా కన్యయైయుండెనని వారి స్వాములు బ్రహ్మచర్యము ననుసరించవలెనని ఆజ్ఞాపించుచు వివాహము ఒకని అపవిత్రపరచునని కేథలిక్కు సంఘము ప్రచారము చేయుచున్నది.

వివాహము ఘనమైనదని (హెబ్రీ 13:4), క్రీస్తు సంఘములో పెద్దగా లేక అధ్యక్షునిగా యుండగోరువాడు వివాహితుడై యుండవలెనని బైబిలు చెప్పుచున్నది (1 తిమోతి 3:1-2). యోసేపుతో తనకు జరిగిన వివాహమును బట్టి మరియ దాంపత్య జీవితమును కొనసాగించుట ఏమి తప్పుకాదు (1 కొరింథీ 7:1-5).

2. పాపరహితముగా మరియ జన్మించుట (The Immaculate Conception of Mary): పసిబిడ్డలు ఆదిమ పాపముతో జన్మింతురను నమ్మకము చొప్పన, కేథలిక్కు సంఘము మరియను గూర్చి ఆందోళన జెందెను. ఏలయనగా వారు మరియను పూజించు చుండిరి, అందువలన 1854వ సంవత్సరములో పోప్ పయస్ IX అను నతడు మరియకు ఆదిమ పాపము లేదని వినాయించుటకు ఆమె పాపరహిత ముగా జన్మించెనని ప్రకటించెను.

పాపమనునది వారసత్వమువలన వచ్చుచున్నది కాదుగాని అది జరిగించుటవలన కలిగేది. "పాపము చేయువాడెవడో వాడే మరణము నొందును. తండ్రియొక్క దోషశిక్షను కుమారుడు మోయుట లేదని కుమారుని దోషశిక్షను తండ్రిమోయడు. నీతిపరుని నీతి ఆ నీతిపరునికే చెందును, దుష్టుని దుష్టత్వము ఆదుష్టునికే చెందును" (యెహెజ్కేలు 18:24, 20).

చిన్న బిడ్డల యొక్క పవిత్రతను, అమాయకత్వమును యేసు బలపరచెను (మత్తయి 18:3-6). అట్టివారిదే పరలోక రాజ్యము అని ఆయన చెప్పెను (మత్తయి 19:14). ఆదాముద్వారా అందరికి మరణము సంప్రాప్తమాయెను అని బైబిలు చెప్పుచున్నది (రోమా 5:12). మరియు మనుష్యు లొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను (హెబ్రీ 9:27). అయితే ఒక తరము నుండి మరొక తరమునకు పాపము సంప్రాప్త మగుననిగాని, పసిబిడ్డలు పాపమును వారసత్వముగా పొందుదురనిగాని బైబిలు చెప్పుట లేదు.

అద్భుతరీతిగా మరియ తన తల్లి గర్భములో పడెనని చెప్పు వచనము బైబిలులో ఒక్కటికూడా లేదు. అట్టి సిద్ధాంతమును గూర్చి యేసుగాని ఆయన అపొస్తలులుగాని కించిత్తుకూడ చెప్పలేదు. మరియ మృతి బొందిన కొన్ని వందల సంవత్సరముల తరువాత ఈ అబద్ధ సిద్ధాంతము కనిపెట్టబడెను. అది కేవలము మానవ కల్పితమే.

3. మరియకు పాపములేకపోవుట (Sinlessness of Mary): మరియ యొక్క జీవితము పాపరహితమైనదని కేథలిక్కు సంఘము చెప్పుచున్నది. అందరును పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారని బైబిలు బలముగా చెప్పుచున్నది (రోమా 3:23; గలతీ 3:22). ఈ నియమము నుండి యేసు క్రీస్తు ఒక్కడు మాత్రమే వినాయించబడిన వాడని బైబిలు చెప్పుచున్నది. (1 పేతురు 2:22, 2 కొరింథీ 5:21; హెబ్రీ 4:15). దేవుడు తన రక్షకుడని మరియ పలికెను (లూకా 1:47). ఆమె పాపము లేనిదైతే ఆమెకు రక్షకుడు అవసరములేదు. పావరహితుడైన క్రీస్తుకు ఒక రక్షకుడవసరమైనట్లు నీవు ఊహించుకోగలవా?

మరియకు పాపములేదని బోధించుటద్వారా ఆమెను మానవత్వమునుండి దైవత్వస్థాయికి తీసుకొనివచ్చుటకు చేయుచున్న ప్రయత్నమదియని గోచరమగుచున్నది. అయితే మరియ ఒక మానవ మాత్రురాలే. మరియ పాపములేని స్త్రీయని అపొస్తలులలో ఎవడు, క్రొత్తనిబంధన వ్రాసిన ఆత్మావేశ లేఖకులలో ఎవడు, చివరకు యేసు క్రీస్తుకూడ ఎన్నడు బోధించలేదు. అయితే మరియను ఆరాధించుటకు మొదలిడిన సంఘము కనిపెట్టిన కట్టుకథ యిది.

4. మరియను ఆరాధించుట (Worship of Mary): దేవుని ఆరాధించు రీతిగా మేము మరియను ఆరాధించుటలేదని కేథలిక్కులు బలముగా వాదింతురు. ఆరాధనను గూర్చిన వివిధనిర్వచనములు అట్లుంచి మరియకు దైవనామము లనేకములు ఈయబడినట్లు సామాన్య మానవుడెవడయినా ఇట్టే గమనించగలడు. ఆమెను దేవుని

తల్లియని వారు పిలుతురు. రకరకాల సుఖసౌభాగ్యముల కొరకు వారామెను వేడుకొందురు. ఆమెను మధ్యవర్తియని, ప్రతినిధియని పిలుతురు. బైబిలు ఆమెను గూర్చి చెప్పదానికంటె ఆమెను వారు ఎంతో ఎక్కువగా కొనియాడుదురు. ఆమెయొక్క పరిశుద్ధత ఒకగొప్ప ఆశ్చర్యకరమైన సంగతి! క్రొత్తనిబంధన ప్రకారము క్రైస్తవులందరు పరిశుద్ధులు (రోమా 15:26; ఫిలిప్పీ 1:1).

మానవుడు దేవుని ఆరాధించవలెనని బైబిలు బోధించుచున్నది (ప్రకటన 19:10; మత్తయి 4:10), ఆమెను కొనియాడే విధముగానైనను మరియను ఆరాధించవలెనని బైబిలు బోధించుటలేదు. క్రీస్తు తన శిష్యులకంటె పైగా ఆయన కుటుంబమును ఉంచుటకు ప్రయత్నించలేదు (మత్తయి 12:43-50). మరియకు చేసే వివిధపూజలు మానవునినుండి కలిగినవే కాని దేవునివలన కలిగినవికావు.

**5. మరియ ఒక మధ్యవర్తిగా** (Mary as a mediator): కేథలిక్కులు మరియ ద్వారా ప్రార్థింతురు. దేవునికి మానవునికి ఆమె ఒక మధ్యవర్తియని వారు నమ్ముదురు. "దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తు యేసను నరుడు" అని I తిమోతి 2:5లో అపొ.పౌలు చెప్పెను.

మానవులకు దేవునికి వున్న మధ్యవర్తి యేసుక్రీస్తు ఒక్కడే. మరియను ఒక మధ్యవర్తియను చెప్పబోధ కేవలము కట్టుకధయేగాక అది దేవుని వాక్యమునకు వ్యతిరేకముగా యున్నది.

**6. శరీరముతో మరియారోహణమగుట** (The Bodily Assumption of Mary): మరియ యొక్క శరీరము నేరుగా పరలోకమునకు తీసికొనపోబడెనని దానికి కుళ్ల పట్టబడనియ్యలేదని 1950వ సంవత్సరములో కేథలిక్కు సంఘము ఒక సిద్ధాంతమును ప్రకటించెను. మరియను మానవత్వముగల దానిగా యుండనిస్తే ఆమె శరీరము మన్నై పోవును (ప్రసంగి 12:7). గనుక కేథలిక్కు సంఘము మరియను

దేవత్వము గలదానిగా చేయుటకు ఈ సిద్ధాంతమును ప్రవేశపెట్టెను. ఈ సిద్ధాంతమును గూర్చిన ఋజువు బైబిలులో ఇసుమంతయును లేదు. మరియ మృతిబొందిన అనేక శతాబ్దముల వరకు కేథలిక్కులలో ఈనమ్మిక ప్రబలి యుండలేదు.

7. అద్భుతములు (Miracles): మరియ ద్వారా అనేక అద్భుతములు జరుగుచున్నవని కేథలిక్కులు రకరకాలుగా చెప్పచుందురు. మరియ అద్భుతరీతిని వారికి కనబడెనని అనేకులు చెప్పచుందురు. ఈ అద్భుత సంబంధ ఆరోపణలన్నియు ఆధునిక పెంతెకోస్తువారి ఆరోపణలవలె యుండును. అవన్నియును వాగ్దానము చేయబడని కనబడని భ్రమలు మాత్రమే.

యేసుక్రీస్తు, అపొస్తలులు బోధించిన బోధనే ఈనాడు క్రైస్తవులు కూడ బోధించవలెను (గలతీ 1:8, 9). మరియను గూర్చి ఈరకరకాల పారంపర్యములు ఆరంభించబడకముందే మనము నడుచుకొనవలసిన విశ్వాసమార్గము బయలుపరచబడి స్థిరపరచబడెను (యూదా 3; ప్రకటన 22:18,19). మరియను గూర్చిన ఈ సిద్ధాంతములు దేవునిచే నియమింప బడినయెడల యేసుగాని, పౌలుగాని, పేతురుగాని వాటినిగూర్చి ఎందుకు చెప్పలేదు?

"మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" అని యేసు చెప్పెను (మత్తయి 15:9). దేవుడు తనకు తానే వ్యతిరేకముగా ప్రవర్తింపడు. ఆయన వాక్యమునకు వ్యతిరేకముగా మరియనుగూర్చి యున్న ఈ సిద్ధాంతములన్నియు మానవకల్పితములే.

- ఆవెన్ కాస్‌గ్రోవ్.

❖❖❖

# మంచివాడు మార్పు చెందుట

*(Conversion of a Good man)*

ప్రస్తుత ప్రజల తలంపునుబట్టి మంచివాడు మార్పు జెందనవుసరం లేదు. మంచివాడు మారి క్రీస్తు తట్టు తిరుగవలసిన పనియేమున్నది? దేవునివలన అతడు అంగీకరించబడు ననుటకు నిత్యజీవితానందము అతనికి లభించుననుటకు అతని మంచి జీవితమే గ్యారంటీకాదా? దీనికి జవాబుగా బైబిలులో సత్పురుషుడును, సద్భక్తియుగల వాడొకడు మార్పుజెంది రక్షింపబడిన సందర్భము ఒకటియున్నది.

కొర్నేలి వందమంది రోమాసైనికుల అధిపతి. యూదుల మధ్యకూడ అతని భక్తిగల జీవితము, ప్రార్థనలు ధర్మ కార్యములు ప్రఖ్యాతి గాంచియుండెను. అయితే కొర్నేలి దగ్గరకు దేవుని దూత వర్తమానము తెచ్చినప్పుడు, అతడు తన మంచిజీవితమునుబట్టి ధర్మ కార్యములనుబట్టి రక్షణ సంపాదించు కొనెనని చెప్పటకు కాదు. దేవుడు అతని హృదయమునుబట్టి సంతోషించెను గనుక అతడు సువార్తవిను సదుపాయమును కల్పించెను. తాను రక్షింపబడుటయెట్లో తెలియజేయు పేతురుకొరకు కబురు పంపుమని అతనికి తెలియజేయ బడెను (అపొ.కా. 11:14).

ఈలోగా దేవుడు పక్షపాతముగల దేవుడు కాదని పేతురు నేర్చుకొనుచుండెను. అన్యజనులు యూదుల ధర్మశాస్త్రముకు, ఆచారము లకు బద్ధులుకాకుండగానే దేవుడు వారినికూడ యూదుల వలెనే అంగీకరించి రక్షించుటకు సంకల్పించెను. పేతురు కొర్నేలి యింటికి వచ్చి అతనికిని అతని యింటివారికిని క్రీస్తును గూర్చి బోధించెను. అతడును, అతని యింటివారును పేతురు ప్రకటించిన వర్తమానమును విని విశ్వసించిరి, మారుమనస్సు పొందిరి, క్రీస్తునామమున బాప్తిస్మము పొందిరి (అపొ.కా.10). కొర్నేలి, నీకొదేములవంటి మంచివారికి ఇప్పటి కింకను "నీవు క్రొత్తగా జన్మించవలెను" అని యేసు ఖచ్చితముగా చెప్పచున్నారు (యోహాను 3:3).

"తీర్పు దేవుని ఇంటియొద్ద ఆరంభమగు కాలము వచ్చియున్నది;

అది మనయొద్దనే ఆరంభమైతే దేవుని సువార్తకు అవిధేయులైన వారి గతి యేమగును? మరియు నీతిమంతుడే రక్షింపబడుట దుర్లభమైతే భక్తిహీనుడును పాపియు ఎక్కడ నిలుతురు?" (1 పేతురు 4:17, 18).

## మీ వెలుగును ప్రకాశింపనీయుడి!

*(Let your Light Shine !)*

ఒకనాడు యాత్రికుడొకడు ఓఫ్రెంచి గ్రామానికి వచ్చాడు. చీకటి పడుతూయుంది, ప్రజలేమో వీధులగుండా తొందరగా నడచుకుంటూ వెళ్లుచున్నారు. అయితే ప్రతివాడు వెలిగింపబడిన ఒక లాంతరును పట్టుకొని వెళ్లుచున్నట్లు ఆయాత్రికుడు గమనించాడు. దీనిని గూర్చి అతడు అడుగగా అతనికీవిధంగా జవాబీయబడింది: "ఈ ప్రజలు తమ గ్రామములోని ఆరాధన మందిరానికి వెళ్లుచున్నారు. ఆమందిరం నిర్మించబడినప్పడు ప్రతి సంఘసభ్యుడు తన సొంత లాంతరును వెలిగించి రాత్రిపూట ఆరాధనలకు తీసికొనిరావలెననే ఒప్పందము జరిగింది. ఆ మందిరాన్ని వెలిగించే విధానము ఇంకొకటేమీలేదు. గనుక తాను ఆరాధనకు వెళ్లకపోతే ఆ మందిరంలో చీకటిగాయుండునని ప్రతివానికి తెలుసు".

ఆయాత్రికుడు అప్పడాగ్రామ ఆరాధన మందిరానికి వెళ్లాడు. ఆమందిరంలో ప్రతి సీటు దగ్గిర లాంతరును పెట్టుకొనే ఒక ప్రత్యేక స్థలం ఉన్నట్లు గమనించేడు. సంఘసభ్యులు వచ్చేకొలది ఆమందిరం ప్రకాశమాన మయ్యింది.

నీవు ఆరాధనకు హాజరు కానప్పడు నీస్థానంలో నీవు లేనప్పడు మందిరంలో చీకటిగాయుండునని నీకు తెలుసా? నీ వెలుగు ఆదివారపు ఉదయారాధనలోనే కాదు ప్రత్యేకంగా రాత్రివేళ జరిగే కూటాలలో అత్యవసరం !!

గమనిక : సత్యవాక్కు వలయు వారు సంవత్సరమునకు 30/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

Satya Vani, P.O.Box - 80, Kakinada - 533 001.

జరిగెను. రాత్రివేళ జరుగు కూటములకు వందలాది మంది హాజరై "దైవ మానవ సహవాసము" అను అంశముపై సత్యవాక్యము బోధింప బడుచుండగా వినిరి. దానవాయి పేట క్రీస్తు సంఘము సోదరులు పి.జయపాల్ గారి ఆధ్వర్యమున విస్తృతమైన ఏర్పాట్లు చేసిరి. భారీ ఎత్తున పబ్లిసిటి చేసిరి. ఆ సభలలో జాషువా గూటం (కాకినాడ), బి. జాషువా (ఏలూరు), సి.హెచ్. జేకబ్ (బెంగళూరు), యం.సామ్యూలు రాజు (సింగంపల్లి) గార్లు వాక్య పరిచర్య చేసిరి. దానవాయి పేటలో సోదరులు పి.జయపాల్ గారు వాక్యపరిచర్య చేయుచు తన నిర్విరామ కృషి వలన క్రీస్తు సంఘములను బలపరచు చున్నారు.

విజయవాడ చుట్టుగుంట సిమెంటు రోడ్‌లో యున్న క్రీస్తు సంఘము తమ 2వ వార్షికోత్సవమును జూన్ 10వ తారీఖున జరుపు కొనిరి. ఆ సందర్భముగా కె. రాజకుమార్ గారు వాక్యోపదేశము గావించిరి. తదుపరి విందు జరిగెను. సిమెంటు రోడ్‌లో యున్న సంఘమునకు టి. అబెద్నెగో గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

జూన్ 24వ తేది మంగళవారం ద్వారపూడి సమీపంలో యున్న జెడ్‌మేడపాడు గ్రామంలో రాత్రిపూట సువార్త కూటము జరిగెను. అక్కడ ఎమ్.జేమ్స్ గారు చాల కాలంనుండి సువార్త చాటుచున్నారు. సోదరులు జాషువా గూటం గారు క్రీస్తు సంఘం యొక్క విశిష్టతను గూర్చి బోధించిరి. పలువురు ప్రశంసించిరి. కూడిన సమాజము అంత క్రీస్తుసంఘముగా ఏర్పడుటకు నిశ్చయించుకొనిరి. క్రీస్తు సంఘ సువార్తికులు పి.రాజరావుగారు ఆ కూటములో పాల్గొనిరి.

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం గొల్లవాని తిప్ప రోడ్డులో యున్న క్రీస్తు సంఘములో సోదరులు రాయప్ప గారు పరిచర్య చేయుచున్నారు. ప్రతి రాత్రి ప్రార్థన కూడికలను జరిపించుచున్నారు. మంచి ఫలితములు సంపాదించుచున్నారు. 15వ తేది నాడు ఒకరికి బాప్తిస్మము ఇచ్చారు.

జూన్ 27వ తేది శుక్రవారం బిక్కవోలు బైబిలు స్కూలు ఆవరణలో సువార్తికుల సదస్సు జరిగెను. పలు ప్రాంతముల నుండి సువార్తికులు హాజరైరి. ఆ సదస్సులో సోదరులు డేమన్ విన్సెంట్ గారు వాక్యపరిచర్య చేసిరి. క్రైస్తవులు సంఖ్యలో రెట్టింపు కావలసిన బాధ్యత ఉన్నదని

ఉద్బోధించిరి. సదస్సులో జాషువా గూటం గారు పాల్గొని క్లుప్తముగా వాక్య పరిచర్య చేసిరి.

బిక్కవోలు బైబిలు స్కూల్ డైరక్టర్ ఎస్.జాన్‌గారు మంచి ఏర్పాట్లు చేసిరి. హాజరైన వారందరికి మంచి భోజన సదుపాయం ఏర్పాటు చేసిరి.

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న టి.వి. కార్యక్రమాలు ఇప్పడు తెలుగు, తమిళం, ఇంగ్లీషు, హింది భాషలలో ఆయా ఛానళ్ళలో ప్రసారమవు చున్నవి. ప్రతి బుధవారం సాయంత్రం 6:30 గంటలకు ఇంగ్లీషు హిందీ భాషలలో సోదరులు సన్నీ డేవిడ్ మరియు ఫ్రాన్సీస్ గార్లు మిరకల్ నెట్ చానల్‌లో వాక్యపరిచర్య చేయుచున్నారు. అందరు వీక్షించ మనవి.

❖❖❖

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From:

**SATYA VAKKU**
**P.O. Box 80,**
**Kakinada - 533 001**

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.